క్లుప్తంగా

కలెక్టర్, ఎస్పీని కలిసిన మాజీ ఎమ్మెల్యే అన్నా



మార్కాపురం: కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను మాజీ ఎమ్మెల్యే మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు శుక్రవారం ఒంగోలులో మర్యాదపూర్వకంగా కలిశారు. మార్కాపురం అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆయన వెంట నాయకులు కేవీ రమణారెడ్డి, వైవీ రావు, సామాజికవేత్త నజీర్ అహ్మద్ ఉన్నారు.

మార్కాపురం సీఐగా సుబ్బారావు



మార్కాపురం టౌన్: మార్కాపురం సీఐగా పి.సుబ్బారావు శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సీఐగా పని చేసిన ఆవుల వెంకటేశ్వర్లు రిలీవ్ అయ్యారు. సుబ్బారావు గతంలో మార్కాపురం పట్టణ ఎస్సైగా విధులు నిర్వర్తించారు. నూతన సీఐని పట్టణ, రూరల్ ఎస్సైలు సైదుబాబు, అంకమరావు, సిబ్బంది కలిసి సన్మానించారు.

కరాటే క్రీడాకారులకు అభినందన



గిద్దలూరు రూరల్: కరాటేలో రాణించిన స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు అభినయశ్రీ, బి.భార్గవిని శుక్రవారం హెచ్ఎం పోలా నాగభూషణరెడ్డి అభినందించారు. చెన్నైలో ఈ నెల 1న నిర్వహించిన 26వ మహాత్మాగాంధీ ఆలిండియా ఇన్విటేషన్ కరాటే చాంపియన్‌షిప్‌లో రాష్ట్రం తరఫున బాలికలు ప్రాతినిధ్యం వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ శోభన్‌బాబు, ఉపాధ్యాయురాలు భారతి పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



కంభం: కంభం చెరువు కట్టపై గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం సీఐ జె.రామకోటయ్య, ఎస్సై బి.నరసింహారావు పరిశీలించారు. భద్రతా చర్యలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. వాహనదారులు పోలీసుల సూచనలు పాటించాలని సూచించారు. కంభం మండలంలో 66 విగ్రహాలకు పోలీసుల అనుమతి పొందినట్లు ఎస్సై తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



గిద్దలూరు రూరల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీవైఎంహెచ్ఓ కె.పద్మావతి సూచించారు. మండలంలోని కె.ఎస్.పల్లె, సంజీవరాయుడుపేట పీహెచ్‌సీలతోపాటు గిద్దలూరు అర్బన్ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. కాగా జ్వరానికి సంబంధించిన ఇంజక్షన్లు అందుబాటులో లేవని స్థానిక బీజేపీ నాయకులు అప్పిశెట్టి ఉదయ్‌శంకర్, రామాంజనేయులు, గుమ్మారాముడు డీవైఎంహెచ్ఓ దృష్టికి తీసుకెళ్లారు. అవి రాష్ట్రమంతా స్టాక్ లేవని ఆమె బదులిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్లు సుమయా, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత డీవైఈఓకు ఘన సన్మానం



మార్కాపురం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్కాపురం డివిజన్ విశ్రాంత ఉప విద్యాశాఖాధికారి పి.మల్లికార్జునరావును పూర్వ విద్యార్థులు(1986–87 బ్యాచ్, బాలుర ఉన్నత పాఠశాల) శుక్రవారం ఘనంగా సన్మానించారు. గణితం బోధించిన తీరును, అలనాటి సంగతులను గుర్తుచేసుకున్నారు. పూర్వ విద్యార్థులు కాశంరాజు విశ్వేశ్వరరావు, గుంటక సుబ్బారెడ్డి, శ్రీనివాస మల్లికార్జున్, తన్నీరు వెంకటరమణ, కాశంగి శ్రీనివాసులు, అన్నా రాము, రహ్మతుల్లా, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విఘ్నాలు తొలగి ప్రజలు సంతోషంగా ఉండాలి

మార్కాపురం టౌన్: వినాయకచవితి పండగను ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, విఘ్నాలు తొలగిపోవాలని మాజీ ఎమ్మెల్యేలు, మార్కాపురం, గిద్దలూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి ఆకాంక్షించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. గణేశ్ మండపాల వద్ద నిబంధనలు పాటించాలని కోరారు.



పొదిలి బాలుర హాస్టల్లో అధ్వానంగా మరుగుదొడ్లు



కంభం ఎస్సీ బాయ్స్ హాస్టల్లో ట్యాంకులో నీరు తాగుతున్న విద్యార్థులు



బేస్తవారిపేట బీసీ హాస్టల్లో దుప్పట్లు, ట్రంకు పెట్టెలు అందని విద్యార్థులు



తర్లుపాడు ఎస్సీ హాస్టల్లో శిథిలావస్థలో మరుగుదొడ్లు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

విద్యార్థుల గోడు.. వినేదెవరు?

మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని హాస్టళ్లలో సమస్యల మోత

- తాగునీటి కోసం అవస్థలు పడుతున్న బాలబాలికలు
- మరుగుదొడ్ల సమస్య పరిష్కరించాలని చిన్నారుల వేడుకోలు
- హాస్టల్ నిర్వహణ వ్యయం, కాస్మోటిక్స్ చార్జీల విడుదలపై సర్కారు మీనమేషాలు
- అరకొర వసతుల మధ్యే చదువుల బండిని లాగిస్తున్న పేదింటి పిల్లలు

వారంతా పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలు. కార్పొరేట్ స్కూళ్లలో వేలు, లక్షల్లో ఫీజులు కట్టలేని పరిస్థితిలో ప్రభుత్వ వసతి గృహాల్లో చేరారు. బంగారు భవిష్యత్ గురించి కలలుగంటూ విద్యాభ్యాస్యం చేస్తున్నారు. అయితే ఆ చిన్నారులను ఇక్కడా పేదరికం వెక్కిరిస్తోంది. వసతుల లేమితో కునారిల్లుతున్న హాస్టళ్లలోనే రోజులు వెళ్లదీస్తూ చదువుకుంటున్న విద్యార్థులకు అండగా నిలవాల్సిన పాలకులు, అధికారులు చోద్యం చూస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు-నేడు కింద రెండు విడతల్లో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారు. హాస్టళ్లను కూడా అదే తరహాలో బాగు చేయాలని గత ప్రభుత్వం భావించినప్పటికీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం గద్దెనెక్కడంతో పరిస్థితులు మారిపోయాయి. హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించడంతోపాటు నాణ్యమైన భోజనం అందించి తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాలని తల్లిదండ్రులు చేస్తున్న విజ్ఞప్తిని సర్కారు ఆలకిస్తుందో లేదో వేచి చూడాల్సిందే. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉన్న హాస్టళ్లలో విద్యార్థులు కలుషితాహారం తిని ఆస్పత్రి పాలైన నేపథ్యంలో మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గంలోని వసతి గృహాల్లో పరిస్థితిపై సాక్షి ఫోకస్..

రాయవరంలో జల ఘోష

మార్కాపురం రూరల్/మార్కాపురం టౌన్: మార్కాపురం మండలంలోని రాయవరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తాగునీరు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలలోని ఆర్‌ఓ ప్లాంటు మరమ్మతులకు గురికావడంతో మినీ వాటర్ ట్యాంకుల వద్ద బాటిళ్లతో క్యూలో నిల్చుంటున్నారు. విద్యార్థులు బోరు నీటిని వాడుతున్నారు. పాఠశాలలో 650 మంది విద్యార్థులకు కేవలం ఇద్దరే మధ్యాహ్న భోజనం వడ్డిస్తుండటంతో క్యూలైన్‌లోనే వారికి సమయం సరిపోతోంది. హడావుడి పడుతూ బాలికలు కడుపునిండా భోజనం చేయలేని దుస్థితి. పాఠశాలలో పరిస్థితిని గమనించిన కొందరు తల్లిదండ్రులు మధ్యాహ్నం పూట ఇంటి నుంచి భోజనం తెచ్చి పిల్లలకు తినిపించి వెళ్తున్నారు. మండలంలోని బీసీ, ఎస్సీ హాస్టళ్లలో విద్యార్థులు దోమల దెబ్బకు నిద్రకు దూరమవుతున్నారు.

నో మెనూ.. పెట్టిందే తిను!

పొదిలి: స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో మంచినీరు, వాడుకనీరు కొనుగోలు చేస్తున్నారు. కాస్మోటిక్స్ నగదు మంజూరు చేయలేదు. దుప్పట్లు ఇవ్వలేదు. 90 మంది పిల్లలకు సరిపడా మరుగుదొడ్లు, స్నానం చేసే వసతులు లేవు. దీంతో క్యూలో నిల్చోవాల్సి వస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన మెనూ అమలు కావడం లేదు. అల్పాహారం, పండు, గుడ్లు సక్రమంగా అందించ లేదు. హాస్టల్లో వంట మనిషి పోస్టు ఖాళీగా ఉంది. హాస్టల్ ఆవరణలో మరి కొన్ని లైట్లు కూడా వేయించాలని కోరుతున్నారు.



మార్కాపురంలో కూర్చునేందుకు వీల్లేక నిల్చుని భోజనం చేస్తున్న బాలికలు



మార్కాపురం : ఇంటి నుంచి భోజనం తెచ్చి పిల్లలకు తినిపిస్తున్న తల్లిదండ్రులు

50 మందికి రెండే మరుగుదొడ్లు

తర్లుపాడు: మండలంలోని ఎస్సీ హాస్టల్లో 120 మంది, బీసీ హాస్టల్లో 50 మంది విద్యార్థులున్నారు. ఎస్సీ హాస్టల్లో బాత్‌రూమ్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రైవేట్ భవనంలో కొనసాగుతున్న బీసీ హాస్టల్లో 50 మందికి కేవలం రెండే బాత్‌రూమ్‌లు ఉన్నాయి.

పర్యవేక్షణ శూన్యం

గిద్దలూరు రూరల్: గిద్దలూరు పట్టణంలోని నంద్యాల రోడ్డులో గల ఎస్సీ బాలికల హాస్టల్లో విద్యార్థినుల మధ్య తరచూ ఘర్షణలు తలెత్తుతున్నాయి. 1975లో నిర్మించిన వసతి గృహం కావడంతో భవనం శిథిలావస్థకు చేరుకుంది. కొన్ని గదుల గోడలు వర్షానికి నాని పడిపోయేలా ప్రమాదకరంగా ఉన్నాయి. స్థానికపెద్ద పోస్టాఫీసు వద్ద ఎస్సీ బాలికల కాలేజీ వసతి గృహంలో 98 మందికిగాను 72 మందే ఉంటున్నారు. రోజూ విద్యార్థులకు సక్రమంగా హాజరు వేయడం లేదు. ఈ రెండు హాస్టళ్లకు ఒక్కరే వార్డెన్ కావడం.. ఆమె ఎక్కడా పూర్తి సమయం అందుబాటులో ఉండలేకపోవడంతో ఇష్టారాజ్యమైపోయింది.

అరకొర సౌకర్యాలతో అవస్థలు

కంభం: కంభంలో ఎస్సీ బాలుర కాలేజ్ హాస్టల్, బీసీ బాయ్స్ హాస్టల్, ఎస్సీ-2 హాస్టళ్లలో పలువురు విద్యార్థులు జ్వరాల బారినపడి ఇళ్లకు వెళ్లిపోయారు. మినరల్ వాటర్ సరిపోక ట్యాంకులో ఉన్న బోరు నీటిని తాగుతున్నారు. విద్యార్థులకు రాత్రి పూట గుడ్డు, అరటి పండు ఇవ్వడం లేదు. ఏడాదికి సంబంధించిన కాస్మోటిక్ బిల్లులు చెల్లించలేదని, హాస్టళ్లలో సౌకర్యాలు మెరుగుపరిచి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మురుగుతో ఇబ్బంది

కొమరోలు: కొమరోలులోని బీసీ కాలనీలో అద్దె భవనంలో ఉన్న ఎస్సీ హాస్టల్ విద్యార్థులు మురుగు సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. నెలల తరబడి మురుగు నిల్వ ఉండటంతో దోమలు వ్యాప్తి చెంది రోగాలబారిన పడుతున్నారు. బీసీ బాలుర హాస్టల్లో మరుగుదొడ్లు, మౌలిక వసతులు లేవు. బీసీ బాలికల హాస్టల్, అల్లినగరం బీసీ బాలుర హాస్టళ్లు సరైన వసతుల్లేని అద్దె భవనాల్లో ఉన్నాయి.



బేస్తవారిపేట ఎస్సీ హాస్టల్లో అసంపూర్తిగా నిలిచిన బాత్‌రూమ్‌లు

అపరిశుభ్రం.. ఆరుబయటే స్నానం

బేస్తవారిపేట: స్థానిక బీసీ హాస్టల్లో మెనూకు మంగళం పాడారు. వంట మాస్టర్ లేకపోవడంతో వాచ్‌మెన్, అటెండర్ వంట చేస్తున్నారు. కంభం బాలికల హాస్టల్ వార్డెన్‌ను ఇన్‌చార్జిగా నియమించడంతో అంతా ఇష్టారాజ్యమైపోయింది. సాయంత్రం, రాత్రి ఇచ్చే స్నాక్స్ ఇవ్వడం లేదు. 80 మంది విద్యార్థులకు 4 మరుగుదొడ్లే ఉన్నాయి. సాయంత్రం 50 మందే హాస్టల్లో ఉంటున్నారు. కొత్తగా చేరిన విద్యార్థులకు ట్రంకుపెట్టె, దుప్పటి, బెడ్‌షీట్ ఇంకా పంపిణీ చేయలేదు. రేకుల షెడ్డులో చలి, దోమలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. హాస్టల్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో దుర్వాసన వస్తోంది. బేస్తవారిపేట ఎస్సీ హాస్టల్లో బాత్‌రూమ్ నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో ఆరుబయట స్నానం చేస్తున్నారు.

రోజూ చెంబు చేతబట్టాల్సిందే..



గొట్లగట్టులో బహిర్భూమికి వెళ్లి వస్తున్న విద్యార్థులు

కొనకనమిట్ల: మండల కేంద్రం కొనకనమిట్ల, పెదారికట్లలో ఎస్సీ హాస్టళ్లు, గొట్లగట్టులో బీసీ హాస్టల్ ఉన్నాయి. అన్ని హాస్టళ్లలో 180 మంది విద్యార్థులున్నారు. గొట్లగట్టు, కొనకనమిట్ల గ్రామాల్లోని హాస్టళ్లలో సరిపడినన్ని మరుగుదొడ్లు, నీటి వసతి లేకపోవడంతో విద్యార్థులు చెంబులు, బాటిళ్లు చేతబట్టి బహిర్భూమికి వెళ్తున్నారు. కాస్మోటిక్స్ చార్జీలు, హాస్టల్ నిర్వహణ నిధులు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.



కొమరోలు : కొమరోలులోని ఎస్సీ హాస్టల్ వద్ద పేరుకుపోయిన మురుగు



గిద్దలూరు ఎస్సీ హాస్టల్లో గోడలకు నీటి చెమ్మ



రాయవరంలో పనిచేయని ఆర్‌ఓ ప్లాంట్



జంగంగుంట్ల జెడ్పీ హైస్కూల్లో మట్టి విగ్రహాలు తయారు చేస్తూ..



గిద్దలూరులో మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న సీఐ సురేష్, దేవాలయాల కమిటీ సభ్యులు



మార్కాపురంలో మైత్రి సంస్థ ఆధ్వర్యంలో 500 మట్టి విగ్రహాల పంపిణీ

జన హితం.. గణ పథం

మట్టి వినాయకుడిని పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని వక్తలు పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వాడకంతో జల వనరులు కలుషితమవుతున్న తీరు, మానవాళికి కలుగుతున్న నష్టంపై అవగాహన కల్పించారు. శుక్రవారం గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మట్టి గణపతులను పంపిణీ చేశారు. పలుపాఠశాలల్లో విద్యార్థులకు గణపతి ప్రతిమల తయారీపై పోటీలు నిర్వహించారు.

–సాక్షి నెట్‌వర్క్



మార్కాపురంలో ఎన్‌జీసీ ఆధ్వర్యంలో ప్రతిమల పంపిణీ



బేస్తవారిపేట జెడ్పీ హైస్కూల్లో మట్టి గణపతులకు పూజలు



కొమరోలు ఎస్‌బీఎన్‌ఆర్‌ఎం స్కూల్లో మట్టి విగ్రహాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

లాడ్జిల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

పొదిలి: లాడ్జిల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వేమనతో కలిసి లాడ్జి యాజమానులతో సమావేశం నిర్వహించారు. లాడ్జికి వచ్చే వారి పూర్తి వివరాలు తీసుకోవాలని చెప్పారు. అనుమానితులు సమాచారం పోలీసులకు ఇవ్వాలని చెప్పారు.

పోషకాహారంతో ఆరోగ్యం



ర్యాలీలో పాల్గొన్న సూపర్‌వైజర్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

కొనకనమిట్ల: తక్కువ ఖర్చుతో ఎక్కువ మేలు చేసే పోషకాహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న సూచించారు. శుక్రవారం మర్రిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆకుకూరలు తప్పని సరిగా ఆహారంలో ఉండేలా చూసుకోవాలని చెప్పారు. పోషకాహారాల తయారీని వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం వాణి, సచివాలయ ఏఎన్ఎం కీర్తన, అంగన్‌వాడీ కార్యకర్త శైలకుమారి, ఆయా శివపార్వతి పాల్గొన్నారు.

ఉద్యోగిపై దాడికి నిరసనగా సచివాలయ సేవలు బంద్



ఉదయం వేళ తాళం వేసి ఉన్న గజ్జలకొండ సచివాలయం

మార్కాపురం రూరల్: మండలంలోని గజ్జలకొండ 1 సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న కుందురు శ్రీనివాసరెడ్డిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అశోక్‌రెడ్డి గురువారం దాడి చేసిన విషయం తెలిసిందే. అందుకు నిరసనగా శుక్రవారం సచివాలయ సిబ్బంది గ్రామ సచివాలయానికి, రైతు సేవా కేంద్రానికి తాళాలు వేసి విధులు బహిష్కరించారు. వీరికి మండలంలోని అన్ని సచివాలయాల సిబ్బంది సంఘీభావం తెలిపారు. ఈ విషయంపై ఎంపీడీవో తోట చందనను వివరణ కోరగా తాను ఈ సంఘటనపై సమాచారం తెలుసుకున్నానని, సిబ్బందితో మాట్లాడి విధులకు హాజరయ్యేలా చూసినట్లు తెలిపారు. టీడీపీ నేత దాడి చేయడంపై మండలంలోని సచివాలయ సిబ్బంది తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ దాడులు చేస్తుంటే విధులు ఎలా నిర్వహించాలని ఆవేదన వ్యక్తం చేశారు.

త్వరలో ఆక్రమణలు కూల్చివేత

కంభం: అనంతపురం–అమరావతి హైవే రోడ్డుకు ఆనుకుని నిర్మించుకున్న అక్రమ కట్టడాలను త్వరలో పడగొడతామని మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కాగితాలగూడెం, కందులాపురం పరిధిలోని పలు భవనాలను స్థానిక రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. గతంలో నష్టపరిహారం అందించి రోడ్డు నిర్మాణం కోసం స్థలం తీసుకున్నామని చెప్పారు. స్థానిక వై.జంక్షన్ సమీపంలో రిటైర్డ్ టీచర్ సుధాకర్‌రెడ్డి నిర్మిస్తున్న భవనాన్ని సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా భవన యజమాని మాట్లాడుతూ గతంలో హైవే నిర్మాణానికి ఎలాంటి సమాచారం లేకుండా తమ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారని, కనీసం పరిహారం కూడా ఇవ్వలేదని వాపోయారు. తన సొంత స్థలంలో రెండేళ్లుగా భవన నిర్మాణం సాగుతోందని, అది ఆక్రమణ ఎలా అవుతుందని, ఇప్పుడు వచ్చి కూలుస్తామనడం ఏమిటని ఆవేదనతో ప్రశ్నించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. నష్టపరిహారం అందకపోతే అందించేలా చర్యలు తీసుకుంటామని, హైవే రోడ్డుకు ఇరువైపులా ఉన్న అక్రమ నిర్మాణాలు తొలగిస్తామని స్పష్టం చేశారు.

పార్టీలు మారే వారికి పదవులా?

పొదిలి: భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు సభ శుక్రవారం రసాభాసగా మారింది. కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్‌ను నియమించడంపై యువ మోర్చా నాయకుడు పందిటి మురళి ప్రశ్నించారు. తరుచూ పార్టీలు మార్చే చంద్రశేఖర్‌కు పదవి ఎలా ఇచ్చారని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బొంతల కృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి తదితరులను నిలదీశారు. 40 ఏళ్లుగా పార్టీని నమ్ముకుని పని చేస్తున్న వారికి కనీస గౌరవం కూడా లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

పొదిలి: మాతృమూర్తి థెరిసా వెల్ఫేర్ సొసైటీ ద్వారా సమాజ సేవ చేస్తున్న బయాలజీ టీచర్ నజీర్ ఉత్తమ అవార్డు పొందడం అభినందనీయమని వక్తలు కొనియాడారు. నజీర్‌ను మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. సంస్థ డైరెక్టర్లు, సభ్యులు కల్లం సుబ్బారెడ్డి, నూర్జహాన్ బేగం, బెల్లంకొండ విజయలక్ష్మి, సోమిశెట్టి శ్రీదేవి, సోమిశెట్టి చిరంజీవి, బీవీ రెడ్డి, బండి అశోక్, కరీముల్లాబేగ్, సామంతపూడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.